సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 18 । జూలై । 2025



వెలవెలబోతున్న ఎర్ర కాల్వ
మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎర్ర కాల్వ వెలవెలబోతోంది. దీంతో కాల్వ ఆయకట్టు పొలాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. 8లో ▸



హుండీ ఆదాయం రూ.2.82 కోట్లు
ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 30 రోజులకు రూ.2.82 కోట్ల ఆదాయం సమకూరింది. 8లో ▸



పాల ఉత్పత్తిపై ప్రభావం
పశువులకు వచ్చే ముద్ద చర్మ వ్యాధి పాల ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. సకాలంలో నివారణ చర్యలు తీసుకోవాలని పశువైద్యాధికారి సూచించారు. 8లో ▸

పేరుకే ఉచితం.. దోపిడీ అధనం



కూటమి కాసుల గుట్టలు.. సిద్ధాంతంలోని వంతెన సమీపంలో హైవే పక్కనే ఇసుక నిల్వలు

వరదల పేరిట కూటమి నేతలు దోపిడీకి తెరలేపారు. గోదావరి పక్కనే స్టాక్ పాయింట్‌ను ఏర్పాటుచేసి లారీకి రూ.9 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. రవాణా ఖర్చులతో వినియోగదారులకు చేరే సరికి ఈ ధర మరింత భారంగా మారుతోంది. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా మారింది.

ఇసుకాసురులు
- వరదల పేరుతో స్టాక్ పాయింట్లు
- గోదావరి చెంతనే లారీ ఇసుకకు రూ.9 వేలు వసూలు
- రవాణా ఖర్చులతో ధర మరింత అదనం
- దోపిడీ దారుణమంటున్న లారీ ఓనర్స్ అసోసియేషన్

అధనం ఎవరి జేబుల్లోకి..



గోదావరి చెంతనే ఉన్న సిద్ధాంతం స్టాకు పాయింట్ వద్ద 20 టన్నుల లారీ లోడింగ్‌కు రూ.9 వేలు వసూలు చేస్తున్నారు. నిర్వాహకులకు ఖర్చు రూ.3 వేలు కూడా కాదు. ప్రభుత్వం ఇసుక ఉచితమని చెప్పి అదనపు వసూళ్లు చేయడం సరికాదు. ఈ అదనపు వసూళ్లు ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయో తెలియని పరిస్థితి.
– రావూరి రాజా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు

సాక్షి, భీమవరం: వరదల సమయంలో కొరత రాకుండా జిల్లాలో స్టాక్ పాయింట్లు ఏర్పాటుకు ఏప్రిల్‌లో జిల్లా ఇసుక కమిటీ నిర్ణయించింది. జిల్లా అవసరాలకు తగ్గట్టుగా ఐదు లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేయాలన్నది లక్ష్యం. జిల్లా అవసరాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన తూర్పుగోదావరి జిల్లా పెండ్యాల ఓపెన్ రీచ్ నుంచి ఇసుక తరలింపు చేయాల్సి ఉంది. ఈ మేరకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక్కొక్కటి చొప్పున స్టాక్ పాయింట్ ఏర్పాటుచేసి నిర్వహణ బాధ్యతల్ని ఏజెన్సీలకు అప్పగించారు. లక్ష్యం మేరకు ఒక్కో స్టాక్ యార్డు వద్ద 70 వేల టన్నుల ఇసుకను నిల్వ చేయాలి. కాగా జిల్లా అంతటా కలిపి కేవలం 1.20 లక్షల టన్నులు మాత్రమే స్టాకు పెట్టడం గమనార్హం. వీటిలో ఆచంట స్టాక్ పాయింట్‌లో 20,100 టన్నులు పెట్టగా, భీమవరంలో 6,240, నరసాపురంలో 2,450, పాలకొల్లులో 19,555, తాడేపల్లిగూడెంలో 35,180, తణుకులో 7,878, ఉండిలో 28,990 టన్నులు నిల్వ చేసినట్టు తెలుస్తోంది. ఇసుక ర్యాంపు నుంచి స్టాక్ పాయింట్‌కు దూరాన్ని బట్టి ఒక్కో టన్నుకు రూ.306 నుంచి రూ.581 ధరగా నిర్ణయించారు. కాగా ఈ స్టాక్ పాయింట్లలో అమ్మకాలు మొదలు కావాల్సి ఉంది.

సిద్ధాంతంలో అనుమతులున్నాయా ?
సిద్ధాంతం వశిష్ట గోదావరి వంతెన దిగువన హైవేను ఆనుకుని భారీ మొత్తంలో నిల్వలతో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటుచేశారు. తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీకి చెందిన ముఖ్య నేత ఈ స్టాక్ పాయింట్ నిర్వహణను చూస్తున్నట్టు తెలిసింది. పక్కనే కిలోమీటరు దూరంలో సీఆర్‌జెడ్ పరిధిలోని నడిపూడితో పాటు పక్కనే తూర్పుగోదావరి జిల్లా కడింపాడు ర్యాంపు నుంచి లారీకి రూ.1,500 నుంచి రూ.2 వేల కిరాయిలపై ఇక్కడికి ఇసుకను తరలించినట్టు సమాచారం. ఇక్కడ స్టాక్ పాయింట్ ఏర్పాటుకు రెవెన్యూ, మైన్స్ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసినట్టు అధికారి ఒకరు తెలిపారు. ఉన్నత స్థాయి నుంచి అనుమతులు వచ్చిందీ లేనిది ఇంకా తమ దృష్టికి రాలేదన్నారు. కాగా బుధవారం నుంచి ఇక్కడ అమ్మకాలను ప్రారంభించారు. 21 టన్నుల లారీకి రూ.9 వేలు వసూలు చేస్తున్నట్టు లారీ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. గోదావరికి కిలోమీటరు దూరం నుంచి ఇసుక తెచ్చి స్టాకు పెట్టి అమ్మకాలు చేస్తున్నారని, లారీ ఇసుకకు రూ.3 వేలు కూడా ఖర్చు కాదని చెబుతున్నారు. గతంలో ఇక్కడి కడింపాడు ర్యాంపు నుంచి రూ.5 వేలకు లోడింగ్ చేస్తే ఇప్పుడు స్టాకు పాయింట్ పేరిట అదనంగా రూ.4 వేలు వసూలు చేస్తున్నారని, ఈ భారం వినియోగదారులపై పడుతోందని అంటున్నారు.

మూతపడిన ర్యాంపులు
ర్యాంపుల్లోకి నీరు చేరి జూలై ప్రారంభంలోనే దాదాపు మూతపడ్డాయి. వరద నీరు తగ్గి మరలా ర్యాంపులు తెరిచేందుకు మరో నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోప్పు జిల్లా అవసరాలకు ఈ నిల్వలు ఏ మేరకు సరిపోతాయోనేది వేచిచూడాలి. ఇదిలా ఉండగా వరదల వేళ ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు సొంత అవసరాల పేరిట ఆచంట, పెనుగొండ, పోడూరు, యలమంచిలి తదితర మండలాల్లో కూటమి నేతలు భారీ ఎత్తున ఇసుక నిల్వలు పెట్టారు. వీటిలో ఏ స్టాకు పాయింట్లకు అనుమతులు ఉన్నాయి?, వేటికి లేవో? తెలియని పరిస్థితి.

బాబు సర్కారు వంచనను ఎండగట్టాలి

- అందుకే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం
- ప్రతి కార్యకర్తా ప్రజల గొంతుకగా పనిచేయాలి
- ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స పిలుపు





ఉండి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, మాట్లాడుతున్న రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స. చిత్రంలో జిల్లా నేతలు

సాక్షి, భీమవరం: ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక సాగిస్తున్న పాలనకు పొంతన లేదని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఏడాది కాలంగా చంద్రబాబు సర్కారు వంచించిన తీరును ఎండగట్టి ప్రజలకు అండగా నిలబడేందుకే బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని చెప్పారు. ఉండి నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పీవీఎల్ నరసింహరాజు అధ్యక్షతన గురువారం కాళ్ల మండలం పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాలులో జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి బొత్స ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లు ఎన్నికల సమయంలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు తదితర వర్గాల వారికి ఇచ్చిన హామీలు, పాలనలోకి వచ్చాక వారు మాట మార్చిన వీడియోలను ప్రత్యక్షంగా స్క్రీన్‌పై చూపించారు. బాబు ష్యూరిటీ –భవిష్యత్తు గ్యారెంటీ పేరిట అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే సూపర్ సిక్స్ హామీలను త్రికరణ శుద్ధిగా అమలుచేస్తామని, ఆ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరేదీ వివరిస్తూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు పంచిన బాండ్ పేపర్లను ఈ సందర్భంగా బొత్స చూపించారు. వాటిలో ఏ పథకాలు అమలుచేశారో చెప్పాలని బొత్స ప్రశ్నించినప్పుడు ఏమీ చేయలేదంటూ కార్యకర్తలు ముక్తకంఠంతో చెప్పారు. అన్ని హామీలూ అమలుచేసినట్టు సీఎం చంద్రబాబు చెబుతున్నారని, ఎవరైనా ఎదురు ప్రశ్నిస్తే నాలుక మందమంటున్నారని బొత్స మండిపడ్డారు. ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి పాలనలో వారికి జరిగిన మోసాన్ని వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటుచేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొత్స సూచించారు.

ప్రజలను వంచించారు
ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి ఇప్పుడు తలచుకుంటేనే భయమేస్తోందని చంద్రబాబు అనడం ప్రజలను వంచించడమేనన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి అందుకు సలహాలు ఇవ్వాలంటూ ప్రజలను కోరడం విడ్డూరంగా ఉందన్నారు.

సెంటు భూమి ఇవ్వలేదు
నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ చంద్రబాబు అనేక వాగ్దానాలు చేసి ఏడాదైందని.. రైతులు, నిరుద్యోగులు, మహిళలకు ఒక్క రూపాయి సాయం చేయలేదని చెప్పారు. ఒక్క నిరుపేదకూ సెంటు స్థలం కూడా ఇవ్వలేదని విమర్శించారు.

ఉండిలో చందాల సంస్కృతి
పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ అభివృద్ధి నిధి పేరిట రైతులు, వ్యాపారుల నుంచి చందాలు వసూలు చేసే సంస్కృతిని కొత్తగా ఉండి నియోజకవర్గంలో చూస్తున్నామని విమర్శించారు. కూటమి నేతల తీరును చూసి ఆయా వర్గాల వారు బెంబేలెత్తిపోతున్నారని చెప్పారు. ఏడాది కాలంలో ఈ నియోజకవర్గంలో 800 మంది పేదల ఇళ్లను కూల్చారని, కానీ ఇదే నియోజకవర్గంలో 25 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని తెలిపారు.

ఇంటింటా ఆవేదన : మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళుతున్నప్పుడు ప్రజలు వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్ పాలనలో చేతిలో ఎప్పుడూ డబ్బులు ఉండేవని, ఇవాళ అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారని వివరించారు. పవన్ కల్యాణ్‌ను నమ్మి మోసపోయామని కాపు మహిళలు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. కొత్త పథకాలు వస్తాయనుకుంటే కాపు నేస్తం కూడా ఇవ్వడం లేదంటున్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలి

మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ కూటమి మోసాలను ప్రజలకు చాటిచెప్పి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలన్నారు. భీమవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీలివ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని గాలికొదిలేయడం చంద్రబాబు నైజమని విమర్శించారు. ఎంటీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ చంద్రబాబు చేస్తున్న మోసాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉందన్నారు.

కార్యకర్తలకు సముచిత స్థానం

అబద్ధాలు చెప్పడం, మోసాలు చేయడంలో చంద్రబాబును మించిన వారుండరని నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కూటమి ఏమీ చేయకుండానే అన్నీ చేశామంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కష్టించి పనిచేసే ప్రతి కార్యకర్తకూ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని, ఆ దిశగా తాను కృషిచేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవీఎల్ కోరారు. క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, జిల్లా అధికార ప్రతినిధి మేడిద జాన్సన్, అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు పదోన్నతులు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ అధికారులకు పదోన్నతులు, బదిలీలు కల్పిస్తూ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీతేజ్ ఇమ్మడి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం కలిగింది.
- ఏలూరు కన్‌స్ట్రక్షన్స్ విభాగంలో ఏఈ వి.యువరాజ్‌కు డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పిస్తూ జంగారెడ్డిగూడెం కన్‌స్ట్రక్షన్స్ విభాగానికి బదిలీ చేశారు.
- ఏలూరు కమర్షియల్ అండ్ టెక్నికల్ ఏఈ ఆర్.భీమేశ్వరరావుకు డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఉంగుటూరు ఆపరేషన్ విభాగానికి బదిలీ చేశారు.
- ఏపీఎస్ఈసీఎంలో డిప్యూటేషన్‌లో పనిచేస్తున్న ఏఈఈ కె.మధును నరసాపురం సీఅండ్‌ఓ డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు.
- జంగారెడ్డిగూడెం కన్‌స్ట్రక్షన్ డీఈఈ వై.మధును పోలవరం ఆపరేషన్ డీఈఈగా బదిలీ చేశారు.
- ఉంగుటూరు డీఈఈ ఎం.శ్రీనివాస్‌ను కోనసీమకు, పోలవరం డీఈఈ బీవీ గోపాలకృష్ణను రంపచోడవరం రూరల్ డీఈఈగా బదిలీ చేశారు.
- రాఘవాపురంలో ఏఈ కె.వెంకటేశ్వరరావును ఏలూరు కోటదిబ్బ ఏఈగా, కోటదిబ్బ ఏఈ కె.దుర్గాభవానిని ఏలూరు టెక్నికల్ ఏఈగా బదిలీ చేశారు.
- వేలేరుపాడులో ఏఈ ఎం.మురళీకృష్ణను నల్లజర్ల ఏఈగా, భీమవరం టెక్నికల్ ఏఈ ఎ.బాలపద్మను తూర్పుగోదావరి టెక్నికల్ ఏఈగా బదిలీ చేశారు.
- భీమవరం ఎల్‌టీఎం బి.నర్సింహమూర్తిని తణుకు ఆపరేషన్ ఏఈగా, పెదవేగి ఆపరేషన్ ఏఈ ఎస్.సురేష్‌బాబును ఏలూరు ఎస్‌పీఎం విభాగానికి ఏఈగా బదిలీ చేశారు.
- భీమవరం జేఈ ఆపరేషన్స్‌గా పనిచేస్తున్న ఎ.సునీతను భీమవరం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఏఈగా బదిలీ చేశారు.

జాలిపూడి మార్గం.. ప్రయాణం నరకం





తాము అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లు చూస్తారని, కొత్త రోడ్లు వేస్తామని హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత ఈ ఊసే మరిచిపోయారు కూటమి నేతలు. ఏలూరు మండలం జాలిపూడి రోడ్డే ఇందుకు నిదర్శనం. మాదేపల్లి సెంటర్ నుంచి జాలిపూడి గ్రామం వరకు రోడ్డు పూర్తిగా ఛిద్రంగా మారింది. భారీ గోతులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్నట్టు ఉంది. రాత్రి వేళల్లో వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతం. జాలిపూడి గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు దుస్థితికి అద్దం పడుతున్న దృశ్యాలివి.
– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

ఏజెన్సీలో భారీ వర్షం



బుట్టాయగూడెంలో వర్షం కురుస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు గురువారం సాయంత్రం ఉపశమనం కలిగింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతగా ఉన్నా సాయంత్ర సమయానికి ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కొన్ని గంటల పాటు కురిసి ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. అలాగే రోడ్లన్నీ వర్షం నీటితో జలమయంగా మారాయి.

సాంకేతికతతో నేరస్తులపై నిఘా

ఐజీ అశోక్‌కుమార్



భీమవరం: ఆధునిక సాంకేతికతతో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టి, నేర నియంత్రణకు కృషి చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక విష్ణు కళాశాలలో అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ నాగరాణితో కలిసి ఐజీ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు జిల్లాలో జరిగిన నేరాలు, ప్రమాదాలు, కేసులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నేరాలను తగ్గించడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నేరాల నియంత్రణలో రాష్ట్రస్థాయిలో జిల్లా పోలీసు శాఖ ప్రథమ బహుమతిని అందుకోవడం గర్వకారణమన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఓపెన్ డ్రింకింగ్‌ను అరికట్టడానికి కృషి చేయాలన్నారు. జిల్లా ఎస్పీ నయీం అస్మి మాట్లాడుతూ సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌తో జిల్లాలో నేరాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. పీ4 కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టడానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ఎస్ కుమారేశ్వరన్, డీఎంహెచ్‌ఓ జి.గీతా భాయ్, డీటీఓ టి.ఉమా మహేశ్వరరావు, ఎఫ్ఎస్ఎల్ అడిషనల్ డైరెక్టర్ ఫణి భూషణ్, డీఈఓ నారాయణ పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేత

ఏలూరు (టూటౌన్): ఏలూరు–దెందులూరు రైల్వేస్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ నంబర్ 351 కి.మీ వద్ద అత్యవసర మరమ్మతులు పూర్తికానందున ఈనెల 20న సాయంత్రం 5 గంటల వరకు రైల్వే గేటు మూసివేస్తామని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.లోకేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ రహదారి మీదుగా ప్రయాణించాలని కోరారు.

న్యూస్‌రీల్

ఎరువుల దుకాణాల్లో సోదాలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

తణుకు అర్బన్: తణుకులో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ముందుగా జయలక్ష్మి ఫెర్టిలైజర్స్ కర్మాగారాన్ని ఆకస్మిక తనిఖీ చేసి స్టాకు నిల్వలు, నాణ్యత పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డులోని నారాయణ అగ్రికెమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ దుకాణంలో సోదాలు చేసి నకిలీలను విక్రయించవద్దని వ్యాపారులను హెచ్చరించారు. పట్టణ వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో సరైన పత్రాలు లేనందున రూ.61,61,050 విలువైన బయో స్టిములెంట్స్ విక్రయాలను నిలుపుదల చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బుల్లిబాబు, నరేంద్ర, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ పోలీస్ గోపాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, వ్యవసాయ అధికారి (టెక్నికల్) కృష్ణకాంత్ పాల్గొన్నారు.

రైతుల అభ్యంతరాలపై విచారణ

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ రహదారి–165లో భాగంగా పాలకోడేరు మండలం విస్సాకోడేరు, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం గ్రామ రైతులు లేవనెత్తిన ఆరు అభ్యంతరాలపై గురువారం జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఎన్‌హెచ్ అధికారుల సమక్షంలో విచారణ చేపట్టారు. రోడ్డు అలైన్‌మెంట్, నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాలను రైతులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని జేసీ చెప్పారు. భూములను ఇచ్చేందుకు అభ్యంతరం లేదని, న్యాయమైన పరిహారం అందించాలని రైతులు కోరారు. అలైన్‌మెంట్ ఏ సర్వే నంబర్ నుంచి వెళ్తుందనే వివరాలను రైతులు కోరగా త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అందిస్తామని జేసీ తెలిపారు. గొరగనమూడి గ్రామం నుంచి రైతులు ఎటువంటి అభ్యంతరాలు లేవనెత్తలేదు. ఎన్‌హెచ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్అండ్‌బి ఎన్.శ్రీనివాస్ రావు, పాలకోడేరు తహసీల్దార్ ఎస్.బి.విజయలక్ష్మి, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

'భవ్య భీమవరం' పనులు వేగిరపర్చాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భవ్య భీమవరం పేరిట చేపట్టిన అభివృద్ధి పనులను ఆగస్టు 15 నాటికి పూర్తయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పనులపై దాతలు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులు ప్రారంభించి ఆరు నెలలు దాటిందన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ఆరు నెలల క్రితమే అమలు చేసినా ఇప్పటికీ ఎందుకు కట్టడి చేయలేకపోతున్నారని అధికారులను ప్రశ్నించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు కనిపిస్తే శానిటరీ సెక్రటరీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రతి పట్టణంలో చేపట్టాల్సిన పింక్ టాయిలెట్ల నిర్మాణంలో అవరోధాలపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తణుకు బస్టాండ్‌లో శంకుస్థాపన చేసిన పింక్ టాయిలెట్ నిర్మాణంపై సాకులు చూపిస్తున్న ఆర్టీసీ ఆర్ఎంపై అసహనం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణంలో అనుమతి లేని బ్యానర్లు, హోర్డింగులను వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓపీఎస్ కోసం నిరసన

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/ద్వారకాతిరుమల: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు, 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు నోటిఫికేషన్ విడుదలై సీపీఎస్ పరిధిలోని గ్రూప్ 2 ఉద్యోగులు, కానిస్టేబుళ్లకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా పాత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏలూరులో నిరసన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని డీఎస్సీ 2008 టీచర్స్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ కట్టా శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్లు వి.జగదీష్, ఈ.శంకర్, బాలసుబ్రహ్మణ్యం, రమేష్, గోపాలకృష్ణ ఓ ప్రకటనలో కోరారు.
సంపూర్ణ మద్దతు : ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఫ్యాప్టో ఏలూరు జిల్లా చైర్మన్ జి.మోహన్, సెక్రటరీ జనరల్ ఎం. ఆదినారాయణ, ఫ్యాప్టో సభ్య సంఘాలు, ఇతర ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు తెలిపారు.

క్లుప్తంగా

25 నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ



కేవీకేలో పెట్టెల్లో పెంచుతున్న తేనెటీగలు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా తేనెటీగల పెంపకంపై ఈ నెల 25, 29, 31 తేదీల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే సమన్వయకర్త డాక్టర్ పి.విజయలక్ష్మి తెలిపారు. అంతరించిపోతున్న తేనెటీగలను రక్షించుకోడానికి, కుటీర పరిశ్రమ ద్వారా లాభాలను పొందడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక ఎకరాకు ప్రారంభంలో రూ.20 నుంచి రూ.25 వేల పెట్టుబడితో మొదలు పెట్టి రెండు మూడు రెట్లు ఆదాయం తేనెద్వారా, పుప్పొడి, ఇతర ఉత్పత్తులు మైనం, విషం ద్వారా పొందవచ్చునన్నారు. ఆసక్తి కలిగిన వారు ఎనిమిది ఫ్రేమ్‌లు కలిగిన పెట్టె కోసం రూ.5500, ఐదు ఫ్రేమ్‌లు ఉన్న పెట్టెల కోసం రూ.4500 ధరతో కేవీకేలో సిద్ధంగా ఉంచామన్నారు. వివరాల కోసం 73826 33692, 94905 05926 నంబర్లలో సంప్రదించాలన్నారు.

20న బాస్కెట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 20వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జూనియర్ స్థాయి బాలికల జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారిణిలు 2007 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఎంపికైన జట్టు ఆగస్టు 14 నుంచి 17 వరకూ పిఠాపురంలో జరిగే అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఒరిజినల్ పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు అసోసియేషన్ ట్రెజరర్ కె మురళీకృష్ణ 94411 71933 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

2.8 కిలోల గంజాయి స్వాధీనం

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని గునుపూడి రైల్వే అండర్ పాస్ వద్ద మంచినీటి సర్వీసు రిజర్వాయరు సమీపంలో రూ.60 వేలు విలువైన 2.862 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ సంచుల్లో గంజాయి కలిగి ఉన్న నిందితులు నాయక్ కరుణాకర్, నీలపు దుర్గాప్రసాద్, గాడిన ప్రభు కుమార్, జెండా నాగరాజును మధ్యవర్తుల సమక్షంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎం.నాగరాజు పర్యవేక్షణలో ఎస్సై కృష్ణాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెలవెలబోతున్న ఎర్ర కాల్వ

చింతలపూడి : ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎర్ర కాల్వ వెలవెలబోతోంది. చింతలపూడి మండలం శెట్టివారి గూడెం వద్ద మేడవరపు చెరువు అలుగు నీరు ప్రవహించేదే ఎర్రకాల్వ. ఇక్కడి నుంచి సుమారు 21 కి.మీటర్లు ప్రవహించి ఎర్రకాల్వ ప్రాజెక్టులో కలుస్తుంది. సుమారు 350 ఎరకాల విస్తీర్ణం కలిగి ఉన్న మేడవరపు చెరువు కింద సుమారు 2 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. ఒకప్పుడు ఎర్రకాల్వ అంటే పొలాలను ముంపునకు గురిచేసే మహమ్మారి అని రైతులంతా భయపడేవారు. 1998లో అప్పటి రాష్ట్ర మంత్రి కోటగిరి విద్యాధరరావు సుమారు రూ.4.11 కోట్ల నిధులు మంజూరు చేయించి కాల్వను 17.5 కి.మీటర్లు అభివద్ధి చేశారు. అప్పటి నుంచి రైతులకు ముంపు బాధ తప్పింది. రానురాను మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎర్రకాల్వ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

మినీ ప్రాజెక్టుగా మార్చాలని డిమాండ్

మేడవరపు చెరువును అభివృద్ధి చేసి మినీ ప్రాజెక్టుగా మార్చాలని ఇక్కడి రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు. వరదల సమయంలో ఎర్రకాల్వ నీరు కిందికి ప్రవహించి ఇక్కడి రైతులకు ఉపయోగపడటం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం చెక్ డ్యామ్‌లు కట్టినా భూగర్భ జలాలు పెరిగి మెట్ట ప్రాంతానికి కొంతవరకు ఉపయోగం ఉంటుందని అంటున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఎర్ర కాల్వకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాల వల్ల వచ్చిన వరద నీరు వృథాగా కిందకు పోయింది. వచ్చే వేసవిలో నైనా చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అలాగే మేడవరపు చెరువు ఆక్రమణలు తొలగించి చెరువును అభివృద్ధి చేస్తే రైతులకు మరింత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చింతలపూడి మండలం రేచర్ల వద్ద నీరు లేని ఎర్ర కాల్వ

మేడవరపు చెరువును అభివృద్ధి చేయాలి



ప్రభుత్వం మేడవరపు చెరువు పూడికను తొలగించి అభివృద్ధి చేయాలి. ఎర్రకాల్వ నీరు కిందికి పోకుండా ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు నిర్మించాలి. కాల్వ నీరు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఎర్ర కాల్వ అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

– చేపూరి ఖాదర్‌బాబు, రైతు, వైఎస్సార్ సీపీ నాయకులు, శెట్టివారిగూడెం

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 2.82 కోట్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గడచిన 30 రోజులకు గాను నగదు రూపేణా స్వామివారికి రూ. 2,82,31,619 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 202 గ్రాముల బంగారం, 5.546 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దైన పాత రూ. 2000, రూ.500 నోట్లు ద్వారా రూ.35,500 లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీవారి క్షేత్రంలో హుండీల నగదు లెక్కింపు దృశ్యం

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.88.69 లక్షలు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మవారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణదికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. 114 రోజుల కాలానికి మొత్తం ఆదాయం రూ.88,69,425, బంగారం 92.500 గ్రాములు, వెండి 623.500 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులో ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, దేవదాయశాఖ అధికారి వి.హరిసూర్యప్రకాశ్, శ్రీ శక్తీశ్వర స్వామి దేవస్థానం యనమదుర్రు ఈఓ. దండు కృష్ణంరాజు, కొణితివాడ గ్రూప్ టెంపుల్స్ ఈఓ కర్రి శ్రీనివాస్, కరూర్ వైశ్య బ్యాంకు సిబ్బంది, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.13 లక్షలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి హుండీ ఆదాయం రూ.13,31,554 వచ్చింది. గురువారం దేవదాయ శాఖ తనిఖీ అధికారి వి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. మూడు నెలల 28 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు సేవా వలంటీర్స్, భాగ్యలక్ష్మి సేవా సభ్యులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, ఆలయ సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, సీనియర్ అసిస్టెంట్ గాంధీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలింత మృతి



మృతురాలు నందిని

పాలకొల్లు సెంట్రల్: మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలింత దుర్మరణం పాలైంది. వివరాల ప్రకారం అప్పనచెర్వు రామచంద్రరావుపేటకు చెందిన ఎం నందిని మూడు నెలల బాలింత (25). శిశువును ఇంటి వద్దే ఉంచి భర్త రత్నరాజు, పెద్ద కుమారుడితో కలిసి వైద్య పరీక్షల నిమిత్తం మోటార్‌సైకిల్‌పై పాలకొల్లులో ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెనుమదం రోడ్డులో ఎస్ఆర్ఆర్ పేట ప్రాంతానికి వచ్చే సరికి ఓ కారు వీరి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నందిని మృతి చెందగా రత్నరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బాబు పక్కనే ఉన్న తుప్పల్లో పడడంతో స్వల్పగాయాలతో సురక్షితంగా ఉన్నాడు. రత్నరాజు ఫిర్యాదు మేరకు పోడూరు ఎస్సై కె సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నందిని మృతదేహం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో ఉంచారు.

లారీ ఢీకొని తాపీ కార్మికుడి మృతి



సత్యబాబు మృతదేహం

కలిదిండి (కైకలూరు): లారీ ఢీకొని తాపీ కార్మికుడు మృతి చెందిన ఘటన కలిదిండి మండలం గుర్వాయిపాలెం సమీప రామిరెడ్డినగర్ వద్ద గురువారం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుపాడుకు చెందిన అవురుగొట్టు సత్యబాబు(45) సైకిల్‌పై వచ్చి గుర్వాయిపాలెంలో తాపీ పని చేసి తిరిగి ఇంటికి వెళుతుండగా కలిదిండి వ్యవసాయ మార్కెట్ నుంచి బియ్యం బస్తాలతో ఆకివీడు రైల్వేస్టేషన్‌కు వెళుతున్న లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్యబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

ఉండి: భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా కాజులూరు మండలం పెదలంక గ్రామానికి చెందిన ఒక్కపట్ల శ్రీను (33)కు హైదరాబాద్‌కు చెందిన కృష్ణవేణితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. మొదట వీరి కాపురం సజావుగానే సాగినా అనంతరం మనస్పర్థలు ఏర్పడడంతో గత రెండేళ్లుగా విడిగా ఉంటున్నారు. శ్రీను ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలో తన సోదరి అల్లూరి జ్యోతి ఇంటివద్ద ఉండి కూలిపనులు చేసుకుంటున్నాడు. సోదరి భర్త దుర్గాప్రసాద్ హైదరాబాద్ వెళ్లి భార్యాభర్తల మధ్య సఖ్యత కుదిర్చేందుకు ప్రయత్నించినా సఫలం కాలేదు. దీంతో ఈ నెల 16వ తేదీ ఉదయం గణపవరం రోడ్డులోని ఓ భోజన హోటల్ పక్కన శ్రీను గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు తెలియజేయగా వారు హుటాహుటీన భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై శ్రీను సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యనమదుర్రు కాలువలో జారిపడి వ్యక్తి మృతి

భీమవరం : భీమవరం రెండోపట్టణం దుర్గాపురానికి చెందిన ఒ. భవాని దుర్గాప్రసాద్ (29) ప్రమాదవశాత్తూ యనమదుర్రు కాలువలో జారిపడి మృతి చెందినట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు. ఈ నెల 15న బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా దుర్గాప్రసాద్ మృతదేహాన్ని యనమదుర్రు కాలువలో గురువారం గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పశువుల పాల ఉత్పత్తిపై ప్రభావం

జంగారెడ్డిగూడెం: పశువులకు వచ్చే ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిజీస్) పాల ఉత్పత్తిపై అధిక ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల చర్మంపై ముద్దలు, గడ్డలు ఏర్పడుతాయి. ఈ వ్యాధి వల్ల పశువులు చాలా ఇబ్బందులు పడతాయి. వీటి నివారణకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏటా టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ వివరించారు.

పాడి - పంట

వ్యాధి లక్షణాలు

- పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి.
- అధిక జ్వరం వచ్చి, బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి.
- ఆహారం తీసుకోకపోవడం లేదా తక్కువగా తీసుకుంటాయి.
- ఈ వ్యాధి సోకిన పశువులు తక్కువ పాలు ఇస్తాయి.



ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులు

వ్యాధి వ్యాప్తి, నివారణ

ముద్ద చర్మ వ్యాధి వైరస్ దోమలు, ఇతర కీటకాల కారణంగా వ్యాపిస్తుంది. వ్యాధి ఉన్న పశువుల నుంచి ఇతర పశువులకు ఈ వ్యాధి వేగంగా వస్తుంది. గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వలన ఈ వ్యాధి నివారణ సాధ్యమవుతుంది. పశువులకు ఈ వ్యాధి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏటా వ్యాక్సిన్‌ను అందిస్తుంది,

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పశువుల నివాస ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలి.
- వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి.
- పశువులకు దోమల నుంచి రక్షణ కల్పించాలి. సమయానికి వ్యాక్సిన్ వేయించాలి
- ఏదైనా లక్షణాలు గమనిస్తే వెంటనే స్థానిక వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి.

జాగ్రత్తలతో వ్యాధిని నివారించవచ్చు



ముద్ద చర్మ వ్యాధి పశువులకు ప్రమాదకరమైనది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వినియోగిస్తే, ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతి రైతు పశువైద్యాధికారుల సలహాలు పాటించి తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి.

– బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

యథేచ్ఛగా మట్టి దోపిడీ



గరవల్లదిబ్బ- బరువానిపేట మధ్య చెరువులో మట్టి తోలకాలు

భీమవరం అర్బన్: జిల్లా కేంద్రమైన భీమవరం మండలంలో మట్టి దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అనుమతులు లేకుండా చెరువుల మట్టిని తవ్వి తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తుండడంతో మట్టి వ్యాపారం మూడు లారీలు, ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది. మండలంలో పెదగరువు, బరువానిపేట, దొంగపిండి తదితర గ్రామాల్లో చెరువుల మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. చెరువులు తవ్వాలనే రైతుల వద్దకు మట్టి మాఫియా వాలిపోయి కొంత సొమ్ముకు మాట్లాడుకుని ఖాళీ స్థలం, ఇళ్ల పూడ్చుకునే వారికి మేము పూడ్చేస్తామంటూ ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. దూరాన్ని బట్టి మట్టి ట్రాక్టర్లకు రూ.800 నుంచి 1500 వరకు, లారీలకు రూ.4 వేలు నుంచి 6 వేలు వరకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. చెరువులో మట్టిని బయటకు తరలించాలంటే రెవెన్యూ, వ్యవసాయ, మత్స్యశాఖ, మైనింగ్, ఆర్అండ్‌బీ, తదితర శాఖలు అనుమతులు ఉండాలి. కానీ కింది స్థాయి అధికారుల చేతులు తడిపి నిబంధనలకు నీళ్లు వదలి మట్టి మాఫియా తమ వ్యాపారాన్ని జోరుగా సాగించేస్తున్నాయి. కాగా మట్టి పెళ్లలు రోడ్డుపై పడడంతో ద్విచక్రవాహనాలు జారిపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సుమారు 80 టన్నుల బరువు మట్టితో రోడ్లపై లారీలు తిరుగుతుంటే రోడ్లు ధ్వంసం అవుతున్నాయని వాపోతున్నారు.



216 జాతీయ రహదారిని ఆనుకుని మట్టిని పూడ్చుతున్న దృశ్యం

బరువానిపేటలో కోట్లలో మట్టి వ్యాపారం

బరువానిపేట సమీపంలోని సుమారు 18 ఎకరాల్లో గత 4 నెలలుగా భారీ లారీలపై మట్టి తోలకాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడి నుంచి తరలివెళ్తున్న లారీలను గొల్లవానితిప్ప వద్ద ఆర్డీవో అడ్డుకుని సీజ్ చేశారు. మళ్లీ ఎండలు కాయడంతో మట్టి లారీలు తిరుగుతున్నాయి. రాత్రి పగలు అనే తేడా లేకుండా లారీలు తిప్పి మట్టి తరలించి కోట్లు కొల్లగొడుతున్నట్లు బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై భీమవరం తహసీల్దార్ రావి రాంబాబును వివరణ కోరగా గ్రామాల్లో చెరువుల తవ్వకం, మట్టి రవాణ వంటివి తమ దృష్టికి రాలేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



బరువానిపేట సమీపంలో చెరువులో..

కాలువలో మృతదేహం లభ్యం

గుంటూరు వాసిగా గుర్తింపు



ఉంగుటూరు కాలువలో మృతదేహాన్ని వెలికితీసిన దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరులోని ఏలూరు కాలువలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు గుంటూరుకు చెందిన గుంజి దుర్గనారాయణ (42)గా పోలీసులు గుర్తించారు. మద్యం సేవిస్తూ మతి స్థిమితం లేనట్లుగా తిరుగుతుంటాడని, ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని, అతడి కాలికి పోలియో ఉందని చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు. నాలుగురోజులు క్రితం గూడెం ప్రాంతంలో కాలువలో పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. అతని జేబులో ఉన్న వివరాల ప్రకారం సమాచారాన్ని బంధువులకు తెలియజేసినట్లు ఎస్సై చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తాడేపల్లిగూడెం మ్యాచురీలో భద్రపరిచారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

యలమంచిలి: మండలంలోని పెదలంక గ్రామానికి చెందిన గెద్దాడ నాగేశ్వరరావు (57) పాముకాటుకు గురై మరణించినట్లు హెడ్ కానిస్టేబుల్ ఈతకోట సత్యనారాయణ తెలిపారు. వ్యవసాయ కూలీగా జీవనం సాగించే నాగేశ్వరరావు గురువారం పశువులకు గడ్డి కోస్తుండగా పాముకాటు వేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుమారుడు నాగ శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పాలకొల్లు సెంట్రల్: ఉల్లంపర్రు గ్రామంలోని సత్యసాయి కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆమె సోదరుడు ఫిర్యాదు చేశాడు. ఎస్సై బి సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

దెందులూరు: మండలంలోని సోమవరప్పాడులో లారీలు నిలుపు ప్రదేశంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన గొన్నాబత్తుల గణేష్ (38)కు పదేళ్ల కిత్రం వివాహం కాగా నాలుగేళ్ల కిత్రం మనస్పర్థల కారణంగా భార్య,భర్తలు విడాకులు తీసుకున్నారు. గత నాలుగేళ్లుగా వేరే మహిళతో సహజీవనం చేస్తుండగా తరచూ ఆమెతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె దగ్గరికి వెళ్లి గొడవ పడుతుండగా కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై గణేష్ లారీపై తాడుతో గురువారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మద్యానికి బానిసై..

పెంటపాడు: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెంటపాడు ఏఎస్సై రాజేంద్ర, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రపురం గ్రామానికి చెందిన జోగి వెంకట సత్యనారాయణ(45) గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మతి స్థిమితం కూడా తగ్గిపోయింది. గురువారం ఉదయం నిద్రనుండి లేచి బయటకు వచ్చి మరలా వెంటనే లోపలికి వెళ్లి తలుపు గడియ పెట్టుకొని ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా షాన్‌వాజ్‌ఖాన్



షాన్‌వాజ్‌ఖాన్

నరసాపురం: వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నరసాపురం పట్టణానికి చెందిన ఎండీ షాన్‌వాజ్‌ఖాన్‌ను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు గురువారం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. షాన్‌వాజ్‌ఖాన్ దీర్ఘకాలంగా వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆయన గతంలో వామపక్ష పార్టీల్లోను, వామపక్ష అనుబంధ కార్మిక సంఘాల్లోను పనిచేసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఒఎన్జీసీ కార్మిక యూనియన్‌లో కూడా పదేళ్లపాటు పనిచేశారు. తరువాత కాంగ్రెస్‌లో చేరగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావంలోనే పార్టీలో చేరి అప్పటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్నారు. తనకు రాష్ట్రస్థాయి పదవి లభించడంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ క్రిష్టియన్ మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శిగా డేవిడ్ రాజు



డేవిడ్ రాజు

పెనుగొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రిష్టియన్ మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శికి ఆచంట నియోజకవర్గానికి చెందిన బి డేవిడ్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కొడమంచిలికి చెందిన డేవిడ్‌రాజు నియామకంపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజాప్రతినిధులు అభినందలు తెలిపారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత

జంగారెడ్డిగూడెం: పాఠశాలలు కాలేజీ బస్సుల డ్రైవింగ్‌లో సురక్షితంగా ఉండేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. గురువారం స్థానిక సీఐ ఎం.సుభాష్ ఆధ్వర్యంలో ఎస్సై షేక్ జబీర్, ట్రాఫిక్ ఎస్సై కుటుంబరావులు సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలు, స్కూల్, కాలేజీ బస్‌ల్లో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సాధించినట్లు తెలిపారు. డ్రైవర్‌లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారన్న సమాచారంతో ఈ తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. మద్యం సేవించి వాహనాలను నడపడం అంటే నడిపే వారికే కాకుండా ఇతరుల జీవితాలతో చెలగాటం ఆడటమే అన్న సందేశాన్ని డ్రైవర్లకు తెలియజేశారు. సీఐ సుభాష్ మాట్లాడుతూ పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యమని, డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యా సంస్థల యాజమాన్యాలు డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి, అలవాట్లపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా అనుమానితులకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం



తణుకులో అంతర్జాతీయ న్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న కామేష్

తణుకు అర్బన్ : అంతర్జాతీయ న్యాయదినోత్సవాన్ని సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ సమాజంలో న్యాయమైన వ్యవస్థ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ మానవ గౌరవం, హక్కులను కాపాడుకునేందుకు సమమైన న్యాయం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కామేష్‌తోపాటు సీనియర్ న్యాయవాది గొల్లపల్లి అంబేడ్కర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాపాక ప్రభాకర్, చింతపల్లి నాగేశ్వర రావు, యింకూలాటి పవన్, ఉండ్రాజవరపు గెరటరాజు, సంతోష్‌మరో పాత్రో, ఎస్‌జీఆర్ భాగ్యానందం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పనిభారాన్ని తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంగన్‌వాడీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ఇతర కార్మిక సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాడేపల్లిగూడెం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మొట్టమొదటి మహాసభ గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. జే.శ్యామల్ అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఝాన్సీ, ప్రాజెక్ట్ కార్యదర్శి అశ్విన్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులకు గ్రాట్యుటీ అమలు చేయాలని, పనిభారాన్ని తగ్గించాలని, ఫేసీ యాప్‌ను రద్దు చేయాలని, బీమా సౌకర్యాన్ని కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, టీఏ బిల్లు, విద్యుత్ బిల్లులు అమలు చేయాలన్నారు. నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షురాలు దీనా స్వరూప రాణి, అధ్యక్షురాలు జే.శ్యామలా కుమారి, కార్యదర్శి ఎండీ హసీనా బేగం, కోశాధికారి ఆర్.అనురాధ, వి.కనక మహాలక్ష్మి, కమిటీ సభ్యులు 26 మందితో ఎన్నిక జరిగింది.

చింతామణిదేవికి సారె అందజేత



ఆషాఢం సారె అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణయోగ ధ్యాన మందిరంలో గురువారం చింతామణిదేవి అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. తొలుత శ్రీహరిసర్వోత్తమ భజన మండలి, శ్రీకృష్ణ భజన మండలి, కోదండరామ భజన మండలి వారిచే భారీ ఊరేగింపు జరిపారు. అమ్మవారికి పండ్లు, వివిధ రకాల స్వీట్లు, అరటిపండ్లు, చలివిడి, పానకం, గాజులు, కుంకుమ, పసుపు, నూతన వస్త్రాలు సమర్పించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

రజకులను ఎస్సీ కేటగిరిలో చేర్చాలి



సమావేశంలో రజక వృత్తిదారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్రం తమిళనాడు రాష్ట్రంలో కలిసి ఉన్నప్పుడు రజకులు ఎస్సీ జాబితాలో ఉండేవారని, ఏపీ విడిపోయిన తరువాత రజకులను బీసీలలో చేర్చారని, తిరిగి రజకులను ఎస్సీ కేటగిరిలో చేర్చాలని ఏపీ రజక సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాస్, ఏపీ రాష్ట్ర రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అద్దాల నరసింహారావు కోరారు. రజక కమ్యూనిటీ హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రజకులను ఎస్సీలలో చేర్చాలని తిరిగి తీర్మానం చేయాలని, కేంద్రానికి పంపాలని కోరారు. రజక చెరువులు, దోబీఘాట్లపై రజకులకే హక్కులు, దేవాలయాల్లో, పాలక మండలి కమిటీలో రజకులకు అవకాశం ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో, దేవాలయాల్లో, ఆసుపత్రిలో రజకులకు వస్త్రాలు ఉతికే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నరసింహారావు, కోటి సాంబయ్య, బి.జగదీష్, పసుపులేటి శ్రీనివాస్, అంజూరి శ్రీనివాస్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలిథీన్.. పరేషాన్

- ఈ వ్యర్థాలతో అనేక వ్యర్థాలు
- భారీగా పెరిగిపోతున్న వినియోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అలంపురం మిడ్‌లెవిల్ కాలువ వద్ద వంతెన సమీపంలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు



కొండేపాడులో పంచాయతీ డంపింగ్ యార్డులో పడేసిన ప్లాస్టిక్ కవర్లు

పెంటపాడు: బయటకు వెళ్తే, కాళ్లు కడుక్కొని ఇంట్లోకి వచ్చే మనం పాలిథిన్ భూతాన్ని మాత్రం స్వయంగా కొనుక్కొని మరీ ఇంట్లోకి తెచ్చుకుంటున్నాం. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా రోజు పదుల సంఖ్యలో క్యారీ బ్యాగ్‌లను వాడుతూ అటు పర్యావరణానికి, ఇటు మానవ ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నాం. వస్త్రంతో తయారు చేసిన చేతి సంచిని వినియోగిస్తే ఒక కుటుంబం రోజుకు పదిపైగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించవచ్చు. కానీ ఆ దిశగా ఎవరూ ఆలోచించడం లేదు. దీంతో విచ్చలవిడిగా పాలథిన్ వ్యర్థాలు, పేరుకుపోయి, ఇవన్నీ గ్రామాల శివార్లలో డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. కొండలా పేరుకుపోతున్న వీటిని వదిలించే క్రమంలో నిప్పు పెడుతున్నారు. దీంతో తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇంకా వాతావరణం వేడెక్కి కాలుష్యం మరింత పెరిగి చివరికి మానవాళికి ముప్పు తెచ్చుకుంటున్నాం. పాలథిన్ నిషేదం అమలుపై అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ప్రతి గ్రామంలో ఊరి శివార్లతో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. బాగా పెరిగిన వాటిని నిప్పంటిస్తున్నారు. కాలుష్యం తగ్గాలంటే ప్రధానంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి. రాబోయే తరాలు ఆరోగ్యంగా జీవించాలంటే నేటి నుంచే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలి. కానీ నియోజకవర్గంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధంచిన దాఖలాలు కనపడటం లేదు. గూడెం పట్టణంతో పాటు, పెంటపాడు, గూడెం మండలాలలో ఆ చర్యలు కాన రావడం లేదు. అన్ని గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీలలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధిస్తూ పంచాయతీ పాలకవర్గాలు ప్రజలకు ఆజ్ఞలు జారీ చేశారు. గతేడాదిలోనే దీనిపై ఆజ్ఞలు జారీ చేశారు. కాగా అమలు మాత్రం లోపభూయిష్టంగా ఉంది. ఏళ్ల క్రితమే పంచాయతీ పాలకవర్గాలు తీర్మానాలు చేసినప్పటికీ అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడుతోంది. దీంతో ఆశయం ప్రతి ఏటా అబాసుపాలవుతోంది. జిల్లాలో ఒక్కొక్క నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో రోజుకు ఒక అరటన్ను క్యారీ బాగులు వినియోగిస్తున్నట్లు అంచనా వేసినట్లు అధికారులు చెబుతున్నారు.

నిప్పు పెడితే ప్రమాదం

ప్లాస్టిక్‌ను కాల్చితే ప్రమాదమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడేవారి సంఖ్య పెరగడానికి ఇది ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కాల్చకుండా ప్రభుత్వం యంత్రాంగం కూడా చర్యలు చేపట్టాలని, ఇందుకు ప్రజాప్రతినిధులు నాయకులు చొరవ చూపాలని కోరుతున్నారు.

వినియోగం..ప్రమాదకరం



ప్లాస్టిక్ వినియోగంతో ప్రధానంగా క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. దీనివల్ల గుండె సంబంధిత జబ్బులు వస్తాయి. ప్లాస్టిక్ సంచిలో వేడిగా ఉన్న ఆహారాన్ని పార్శిల్ చేయడం వల్ల దానిలో ఉన్న రసాయినాలు కరిగిపోతాయి. దానిని తినడం వల్ల వివిద ఆరోగ్యసమస్యలు వస్తాయి. ప్లాస్టిక్ భూమిలో కరిగేందుకు చాలా ఏళ్లు పడుతుంది. దీంతో పండించే పంటలు నాశనం కావడంతో పాటు, ప్రజలు కూడా రోగాల పాలవుతారు.

– డా.పూజిత, ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. దీనివల్ల మానవాళితో పాటు, జీవాలకు ప్రమాదకరమే. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. జనపనారతో సమస్యలు రావని గమనించాలి. క్యారీ బ్యాగు వినియోగం వల్ల తరచూ రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి.

– డా.తోట రాజేష్, పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి

చర్యలు చేపట్టాం

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడరాదంటూ గతంలో గ్రామాలలో మైకు ప్రచారం చేయించాం. అన్ని సచివాలయాలకు ఆదేశాలు జారీ చేశాం. వ్యాపారులకు అవగాహన కల్పించాం. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగం వల్ల వచ్చే అనర్థాలను వివరించాం. త్వరలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకం తగ్గించకుంటే చర్యలు తీసుకొంటాం.

– ఇన్‌చార్జి ఎంపీడీవో, టీవీ సత్యనారాయణ పెంటపాడు

రీ సర్వే రికార్డులను పూర్తి చేయండి



సమావేశంలో పాల్గొన్న కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: అర్బన్ రీ సర్వే రికార్డు ఆఫ్ రైట్స్(ఆర్ఓఆర్) ఫైనల్ చేయాలని మునిసిపల్ కమిషనర్ ఎం. ఏసుబాబు కోరారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గూడెం మునిసిపాలిటీని ప్రాజెక్టుగా తీసుకొని భూములు రీసర్వే చేశారన్నారు. సరైన రికార్డులు, అర్బన్ ల్యాండ్స్, రికార్డులు ఆన్‌లైన్ చేసి, ప్రజలకు రికార్డు ఆఫ్ రైట్ అందించాలన్నారు. మునిసిపల్ అధికారులు బ్యాలన్స్ రికార్డు అప్డేట్ చేసి వెబ్‌సైట్‌లో ఉంచాలన్నారు.ఆన్‌లైన్ ప్రక్రియను ఆగస్టు రెండో తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో డేటా తప్పులు లేకుండా చూడాలని, ప్రజలు, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. రికార్డు ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. కొత్తగా వచ్చిన రికార్డులను పరిశీలించాలన్నారు. జువ్వలపాలెం ప్రాంత రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. దీనిపై పట్టణ సర్వేయర్ రౌతు రామకృష్ణ శిక్షణను ఇచ్చారు. ప్లానింగ్ సెక్రటరీ డి.సత్యనారాయణ మెళకువలు నేర్పారు. రికార్డుల్లో తప్పులు లేకుండా చూడాలని తహసిల్దార్ సునీల్ కుమార్‌ను కోరారు. వ్యవసాయ భూముల వివరాలు రైతులు కోరితే ఇవ్వాలని ఆయన ఆదేశించారు. మునిసిపల్ మేనేజర్ యం.రవి సుధాకర్, ఏసీపీ జి.సీతారాంలు ఉన్నారు.

కమర్షియల్ ట్యాక్సెస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఏలూరు డివిజన్ జాయింట్ కమిషనర్ నాగార్జునరావును కలిసిన అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: ఏలూరు డివిజన్ జాయింట్ కమిషనర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి. నాగార్జునరావును ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి రాజేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు. తమ విధుల్లో బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వానికి రెవెన్యూ సమకూర్చడమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని జాయింట్ కమిషనర్ నాగార్జున సూచించారు. జూనియర్ అసిస్టెంట్స్‌కి సంబంధించి 2017 నుంచి సీనియారిటీ లిస్ట్ పెండింగ్‌లో ఉందని తెలపగా దానికి సంబంధించిన ఆదేశాలను ఏ1 వద్ద ఉన్నాయని త్వరలో లిస్టు తయారు చేయిస్తానని చెప్పారు. ఏలూరు డివిజన్‌కు సంబంధించి కమర్షియల్ ట్యాక్స్ ఎంప్లాయిస్‌కు ఎటువంటి ఇబ్బందులు ఉన్న పరిష్కరిస్తానని వివరించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కెపి శైలజను గౌరవపూర్వకంగా కలిశారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చొడగిరి శ్రీనివాస్, నేరుసు రామారావులను కలిసి ఏపీ ఎన్జీవోస్ తాలూకాలో కమర్షియల్ ట్యాక్స్ ఎంప్లాయిస్‌కు కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలని అడిగినట్లు రాజేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వై నాగేంద్ర, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రశాంత్, ఉపాధ్యక్షుడు సతీష్, నరేష్, బాలాజీ, సహాయ కార్యదర్శులు సత్య యాదవ్ , రాజేష్, సందీప్, అజయ్ సింగ్ కోశాధికారి బీవీ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్ సౌత్ పరిధిలో 33/11 కేవీ ఎస్ఎస్ పెంటపాడు సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ మార్కెట్ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించేందుకుగాను ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లి గూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. మెయిన్ రోడ్డు, తాళ్ళముదునూరుపాడు, సీతారాంపేట, భాగ్యలక్ష్మీపేట పరిధిలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నందున, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

తణుకు అర్బన్: తణుకు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ లైన్స్ మరమ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి, ఎన్జీవో కాలనీ, డీఎల్‌కే రోడ్డు, సాయి హాస్పిటల్ ప్రాంతం, కొండాలమ్మ పుంత, ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల రోడ్డు, టి.వేమవరం, జంగంచెర్వు, హౌసింగ్ బోర్డు కాలనీ, ఐక్యనగర్, సజ్జాపురం, భాష్యం స్కూలు నుంచి గ్రాండ్ గోస్తనీ వరకు, బ్యాంక్ కాలనీ, సూర్యాలయం వీధి, బొమ్మల వీధి, స్త్రీ సమాజం రోడ్డు, లయన్స్ క్లబ్ ప్రాంతం, బీపీఎల్ షోరూమ్ నుంచి యూనియన్ బ్యాంకు ప్రాంతాల్లోను, తణుకు రూరల్‌లో పైడిపర్రు, మండపాక గ్రామాలు, అత్తిలి మండలంలో అత్తిలి, పాలి, కె.సముద్రగట్టు, వరిఘేడు, బల్లిపాడు, గుమ్మంపాడు, శివపురం, తిరుపతిపురం, పాలూరు, ఆరవల్లి, మంచిలి, కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం, చినరామునిచెర్వు గ్రామాలు, ఇరగవరం మండలంలో కంతేరు, కత్తవపాడు, పాదలాడు, కాకిలేరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్‌లో..

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవం, జగన్నాథపురం విద్యుత్ లైన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో జగన్నాథపురం, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకుల గుంట, నీలాద్రిపురం సబ్‌స్టేషన్ పరిధిలో నీలాద్రిపురం, పుల్లాయగూడెం, కృష్ణాపురం, పట్టింపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నన్నయ్యలో క్యాంపస్ డ్రైవ్



క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగులు పొందిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: పట్టణంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వర్సిటీ, క్లౌడ్స్ అండ్ కోడ్స్ కంపెనీతో కలిసి గురువారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది.గూడెం పరిసర ప్రాంతాల ఫార్మసీ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. అభ్యర్థుల సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు తదితర విషయాలపై మూడు రౌండ్ల ఇంటర్వ్యూ జరిగింది. 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్ ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంటు ఆఫీసర్ డాక్టర్ నిత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరాడక చనిపోయే ప్రమాదం



తాడేపల్లిగూడెం మండలంలో ఆవులకు లంపి చర్మ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆవుల్లో వచ్చే లంపి వైరస్ వ్యాధి తీవ్రత వల్ల ఊపిరాడక చనిపోయే ప్రమాదం ఉందని మండల పశువైద్యాధికారి డాక్టర్ టివి.విజయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పట్టింపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో ఆవులకు లంపి చర్మవ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆవులకు శరీరంపై బొబ్బర్లు, అధిక జ్వరంతో పాల దిగుబడి తగ్గుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో వ్యాధి తీవ్రతను బట్టి ఊపిరాడక చనిపోతాయన్నారు. ఈ నెల 31వ తేది వరకు ఈ టీకాలు వేస్తామని, పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం పట్టింపాలెంలో 68, కొమ్ముగూడెంలో 32 ఆవులకు టీకాలు వేశారు. కాగా, శుక్రవారం నీలాద్రిపురం రైతు సేవా కేంద్రం వద్ద లంపి చర్మ వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం

- కూటమి పాలనపై మండిపడ్డ మాజీ మంత్రి కారుమూరి
- అత్తిలిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం



తణుకులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి

అత్తిలి: ఎన్నికల సమయంలో బాలు షూర్యరిటీ... సూపర్ సిక్స్ పేరున ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు సీఎం చంద్రబాబు మోసం చేశారని, చంద్రబాబు అంటే ప్రతిఒక్కరికీ గుర్తుకు వచ్చేది మోసమేనని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు అన్నారు. గురువారం రాత్రి అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి మాట్లాడుతూ 1994నుంచి బాబు మోసం కొనసాగుతుందన్నారు. అప్పులు చేసి చేసి గొప్పలు చెప్పుకోవడమే మిగులుతుందని, ఇప్పటి వరకు రూ.1.72లక్షలు అప్పులు చేశారని, ఒక్క సంక్షేమ పథకమూ సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. కూటమి పాలన అంతా మోసాలమయమన్నారు. ముందుగా అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, ఉపసర్పంచ్ వెంకన్నబాబు, మాజీ సర్పంచ్ పెన్మెత్స రామరాజు, పార్టీనాయకులు బుంగా సంజీవరావు, యాళ్లసాధుసుందర్‌సింగ్, నేలపాటి సుబ్బయ్య, కలిగిపూడి పెదకనకయ్య, గుండే సర్వేశ్వరరావు, దండిపండు, నేలపాటి అశోక్, పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రాజకీయ జీవితంతా మోసపూరితం..

తణుకు అర్బన్: చంద్రబాబు రాజకీయ జీవితమంతా మోసపూరితమేనని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. 45 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీలో కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లేనని విమర్శించారు. తణుకు హౌసింగ్ బోర్డు కాలనీ గురువారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయన చెప్పింది చేయకపోవడాన్ని బాగా వంటపట్టించుకుని ఎప్పటికప్పుడు ప్రజల్ని మోసం చేయడం పరిపాటిగా మారిందని అన్నారు. 2024 ఎన్నికల్లో మాత్రం ఇష్టానుసారంగా హామీలు గుప్పించేసి, సంపద సృష్టించి సంక్షేమం అందిస్తానని భింకాలు పలికి నేడు మంగళవారం వస్తే చాలు అప్పుతెచ్చేసి దాచుకో దోచుకో అన్నట్లుగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా కరెంటు బిల్లుల మోతతో ప్రజల్ని అడ్డంగా మోసం చేశారని, ఎన్నికల ముందు కరెంటు బిల్లులు పెంచబోమని అవసరమైతే తగ్గిస్తామంటూ హామీలు ఇచ్చి నేడు ఆ చార్జీలు ఈ చార్జీలు అంటూ బిల్లుల మోత మోగిస్తున్నాడని దుయ్యబట్టారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అన్నారని కానీ నేడు చాలా మందికి ఒక్క సిలిండరుకు మాత్రమే డబ్బులు పడ్డాయని చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనక దుర్గ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, వార్డు నాయకులు పైబోయిన ఏసుబాబు, కంచుమర్తి విశ్వేశ్వరరావు, పైబోయిన సాయి తేజ, ఎస్వీ జాకబ్‌బాబు, బిరుదుకోట చింతన్న, రాచమళ్ల సత్యనారాయణ, గారపాటి సత్యనారాయణ, మనుబర్తి లలిత, పార్థసారధి పాల్గొన్నారు.

మోసాలను ప్రజలకు వివరిద్దాం

తణుకులో పార్టీ నాయకుల సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి



తణుకులో పార్టీ పట్టణ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అమాయక ప్రజలను చంద్రబాబు నిట్టనిలువునా నమ్మించి మోసం చేసిన వైనాన్ని ప్రజలందరికీ తెలియజేప్పేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకులో ఆయన నివాసంలో గురువారం పట్టణ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్, ఎన్నికల హామీల అమలు, పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బాలు ష్యూరిటీ అంటే..మోసాలు, అవినీతి, అక్రమాలు, అబద్దపు హామీలే అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ఎన్నికల హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగడదామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుతో గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో ప్రతి గడపకి మనం తిరిగిన అనుభవం ఉందని, ఎన్నికల సమయంలో కూడా మనం ప్రతి గుమ్మాన్ని తాకామని అదే ఒరవడితో నేడు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, జిల్లా సెక్రటేరియట్ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, ప్రచారకమిటీ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, లీగల్‌సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, షణీంద్ర కుమార్ వీరమల్లు, షేక్ ఫహీమా, నత్తా కృష్ణవేణి, జంగం ఆనంద్‌కుమార్, పైడి సాయి సూర్య, చింతాడ సంజీవరావు, షేక్ బాజీ, జిలానీ, వై.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ పురస్కారం అందుకున్న డాక్టర్ వెంపటాపు



హైదరాబాద్‌లో పురస్కారం అందుకున్న డాక్టర్ వెంపటాపు

తణుకు అర్బన్: ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటీషన్‌లో తణుకుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు అత్యుత్తమ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ సామల లక్ష్మయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన చిత్ర ప్రదర్శనలో 'నేను రేపు పుట్టాల్సివస్తే' శీర్షికతో వెంపటాపు రూపొందించిన చిత్రరచనకు పురస్కారంతోపాటు రూ. 10వేలు నగదు పురస్కారం లభించినట్లు వెంపటాపు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్ అండ్ కల్చర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల రెసిడెన్సియల్ సహాయ కార్యదర్శి జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ చేతులమీదుగా పురస్కారం అందుకున్నట్లు వివరించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

పెనుమంట్ర: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025 తనిఖీల్లో భాగంగా గురువారం కేంద్ర బృందం మార్టేరు గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా కేంద్ర బృందం రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ (ఫీల్డ్) ఎం.మధుమతి పశ్చిమ గోదావరి జిల్లా కన్సల్టెంట్ ఎం.సంతోష్ కుమార్‌లతో స్థానిక అధికారులు గ్రామంలోని పంచాయతీ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కమ్యూనిటీ టాయిలెట్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు.